
సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం ၊ 10 ၊ మార్చి ၊ 2024



మిడ్‌మానేరులో 12 టీఎంసీలు

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో ప్రస్తుతం నీటిమట్టం 12.54 టీఎంసీలకు చేరింది. ఎల్‌ఎండీకి 3,500క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని 'సెస్' అధికారులు తెలిపారు. పాతబస్టాండ్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, ఆసిఫ్‌పుర, అశోక్‌నగర్, అనంతనగర్, అంబికానగర్, కోర్టు ఏరియా, అంబేడ్కర్‌నగర్, రాళ్లబావి, ధోబీగల్లీ, రెడ్డివాడ, గాంధీనగర్, విద్యానగర్, గీతానగర్, పోచమ్మ టెంపుల్, చంద్రంపేటల్లో సరఫరా ఉండదు.

గరిష్టం/కనిష్టం
36.0/24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు 'రంగినేని ఎల్లమ్మ' సాహిత్య పురస్కార ప్రదానం

సిరిసిల్ల: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'రంగినేని ఎల్లమ్మ' సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఆదివారం సిరిసిల్ల రంగినేని ట్రస్ట్‌లో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు రంగినేని మోహన్‌రావు శనివారం తెలిపారు. 'రంగినేని ఎల్లమ్మ' సాహిత్య పురస్కారం–2023కు 'వంశీకృష్ణ' రాసిన 'రెప్పవాలని రాత్రి' కవితా సంపుటికి అందిస్తున్నామని అవార్డు కమిటీ కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. అతిథులుగా ప్రముఖ కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ, కవి జూకంటి జగన్నాథం, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కవి, విమర్శకులు ఎం.నారాయణశర్మ, నేషనల్ బుక్ ట్రస్ట్ సంపాదకుడు డాక్టర్ పత్తిపాక మోహన్ హాజరవుతారని ట్రస్ట్ కోశాధికారి రంగినేని నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.అనూష, యశస్వినిల బృందం శాస్త్రీయ నృత్యం ఉంటుందని పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామివారి లడ్డుతో లింగం, ఆలయ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నారాయణపూర్‌లోని రాజన్న దత్తత ఆలయం శివాలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఉదయం అర్చకులు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో లింగోద్భవం కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి లడ్డూకు వేలం పాట నిర్వహించగా.. ఎలవేని లింగం రూ.6వేలకు దక్కించుకున్నారు. భక్తులకు నిమ్మ బుచ్చిరెడ్డి, మోతె లక్ష్మారెడ్డి ప్రసాదాలు వితరణ చేశారు. మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, ఎంపీటీసీ అపెరా సుల్తానా, ఆలయ కమిటీ చైర్మన్ సూర నర్సయ్య, నిమ్మ సుధాకర్‌రెడ్డి, బొమ్మడి భాస్కర్ పాల్గొన్నారు.

ఆసాములు, కార్మికుల కష్టాలు తీర్చాలి



రిలేదీక్షలో వస్త్ర పరిశ్రమ ఆసాములు

సిరిసిల్లటౌన్: మూతబడిన సిరిసిల్ల వస్త్రపరిశ్రమను ప్రభుత్వం తెరిపించాలని ఆసాముల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ కోరారు. ఆసాములు, కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బీవైనగర్‌లోని చేనేత, జౌళిశాఖ ఆఫీస్ ఎదుట చేపట్టిన రిలేదీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరాయి. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, యజమానుల నుంచి సహాయం అందక కార్మికులు, ఆసాముల కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నాయన్నారు. దీక్షల్లో గాజుల నరేశ్, బచ్చు రాములు, బూర కుమార్, పోరండ్ల శ్రీనివాస్, తెల్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యుదయానికి పోరాటం



మాట్లాడుతున్న టి.స్కైలాబ్‌బాబు

సిరిసిల్లటౌన్: దేశంలో మహిళా అభ్యుదయానికి సీపీఎం, అనుబంధ సంస్థలు పోరాటాలు చేపడుతున్నాయని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీవైనగర్ పార్టీ ఆఫీస్ ప్రాంగణంలో అంతర్జాతీయ శ్రామిక మహిళ దినోత్సవం, బీజేపీ పాలనలో మహిళలపై పెరిగిన అత్యాచారాలపై శనివారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మహిళలను అన్ని మతాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా అణచివేశాయన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్మును అయోధ్య ఆలయం, పార్లమెంటు భవనం ప్రారంభోత్సవాలకు పిలవకపోవడంపై ప్రశ్నించారు. మహిళా బిల్లును చట్టసభల్లో ఎందుకు పాస్ చేయడం లేదని అడిగారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, ఐద్వా జిల్లా కార్యదర్శి జువ్వాజి విమల, కోడం రమణ, నాయకులు లక్ష్మి, సులోచన, శారద, గీత, లక్ష్మి, పూజ, నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.



రాజన్న ఆలయం మెట్ల వద్ద సెల్ఫీ దిగుతున్న భక్తులు



మొక్కులు చెల్లించినం రాజన్న అని దండం పెట్టుకుంటున్న భక్తులు

వెళ్లొస్తాం రాజన్నా..

- మొక్కు చెల్లించినం... సల్లంగచూడు తండ్రి
- కొనసాగుతున్న భక్తుల రద్దీ
- బద్దిపోచమ్మకు బోనం మొక్కులు
- ముగిసిన రాజన్న మహాజాతర
- ప్రత్యేకాకర్షణగా శివార్చన
- రెండు రోజుల్లో రూ.కోటి ఆదాయం



స్వస్థలాలకు తిరిగి వెళ్తున్న భక్తులు

వేములవాడ: మహాశివరాత్రి వేడుకలు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా కొనసాగాయి. శనివారం నాడు ఉత్సవాలు ముగియడంతో భక్తులు తిరిగి స్వస్థలాలకు వెళ్తున్నారు. మూడు రోజుల క్రితం ముల్లెమూటలతో వేములవాడకు వచ్చిన భక్తులు ఆధ్యాత్మిక జరిలో మునిగితేలారు. శుక్రవారం రాత్రి జాగారం చేసి శనివారం ఉదయమే స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు. భక్తులు తిరిగి క్షేమంగా వెళ్లేందుకు ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సు సర్వీసులను పెంచారు. గుడి చెరువుకట్టి కింది బస్టాండు నుంచి బస్సులను నడిపించారు.

కొనసాగిన భక్తుల రద్దీ

రాజన్న దర్శనానికి శనివారం ఉదయం సైతం భక్తులు భారీగా వచ్చారు. కోడెమొక్కులు, తలనీలాల సమర్పణ, నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు. జాగారం ముగియడంతో బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలతో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మ ఆలయం రద్దీగా మారింది. జాతర బందోబస్తుకు వచ్చిన ఇతర జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం మధ్యాహ్నం రిలీవ్ చేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహాశివరాత్రి ఉత్సవాలు ముగియడంతో ఆలయ అధికారులు, పోలీస్ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. జాతర విజయవంతానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. జాతర ప్రశాంతంగా ముగియడంతో ఆలయ అధికారులు సంకెపల్లి హరికిషన్, సిరిగిరి శ్రీరాములు, నాగుల మహేశ్, అరుణ్, ఎడ్ల శివసాయి, దిలీప్ తదితరులు ఈవో కృష్ణప్రసాద్‌ను సన్మానించారు.

రూ.కోటి ఆదాయం

మహాజాతర సందర్భంగా శుక్ర, శనివారాల్లో దాదాపు 2 లక్షలకు పైగా భక్తులు రాజన్నను దర్శించుకున్నారు. ఉచిత పాస్‌లు రద్దు చేయడంతో వివిధ రూపాల్లో భక్తుల ద్వారా రూ.కోటి వరకు ఆదాయం వచ్చినట్లు అకౌంట్స్ ఏఈవో ప్రతాప నవీన్ తెలిపారు. వారం రోజులుగా జాతర ఏర్పాట్లలో బిజీబిజీగా గడిపిన ఆలయ అధికారులు ఈవో కృష్ణప్రసాద్, ఈఈ రాజేశ్, ఏఈ శేఖర్, పర్యవేక్షకులు శ్రీరాములుకు వైద్యసిబ్బంది శనివారం వైద్యపరీక్షలు చేసి, పలు సూచనలు చేశారు. పారిశుధ్య సిబ్బంది పట్టణంతోపాటు గుడి ఖాళీ ప్రదేశాన్ని పరిశుభ్రం చేస్తూ కనిపించారు.



బై బై చెబుతున్న భక్తులు

ఐదేళ్లు గోసపడుడే

- మార్పు కోరితే.. నీటికష్టాలు వచ్చాయి
- బండి సంజయ్‌కు ఓటేస్తే అభివృద్ధి లేదు
- మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లిల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో తోట ఆగయ్య, చిక్కాల రామారావు, దరువు ఎల్లన్న

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి(సిరిసిల్ల): మార్పు కోరితే.. నీటి కరువు వచ్చింది.. బండి సంజయ్‌కు ఓటేస్తే అభివృద్ధి ఆగిపోయిందని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఐదేళ్ల గోసపడుడే అని అన్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో శనివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు నీళ్ల కరువు వచ్చి, రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రాష్ట్రంలో నెర్రెలుబారిన పంటపొలాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల తర్వాత బాయికాడ పడుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మరమ్మతు చేసే అవకాశం ఉన్నా తప్పించుకునేందుకు గత ప్రభుత్వంపై అపవాదులు వేస్తున్నారని విమర్శించారు. రైతుబంధు ఇప్పటికీ రాలేదని, రైతులకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోసకారి రేవంత్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ వీర్నపల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అనేక విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాని కోరారు. బండి సంజయ్‌కుమార్ ఎంపీగా వీర్నపల్లి మండలానికి చేసిందేమి లేదన్నారు. ఈనెల 12న కరీంనగర్‌లో నిర్వహించే కథనభేరిని విజయవంతం చేయాలని కోరారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీలు చీటి లక్ష్మణ్‌రావు, కళావతి, ఎంపీపీలు పిల్లి రేణుక, మాలోత్ భూల, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, పార్టీ ఎల్లారెడ్డిపేట మండలాధ్యక్షుడు కృష్ణహరి పాల్గొన్నారు.

అనారోగ్యంతో కిందపడ్డ కార్యకర్త

ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మండల కేంద్రానికి చెందిన కార్యకర్త శివరాత్రి దేవరాజు పిట్స్‌తో కిందపడ్డాడు. దీంతో సమావేశంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. దేవరాజును వెంటనే కార్యకర్తల సహాయంతో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగుండారం మాజీ సర్పంచ్ భూక్య శంకర్‌నాయక్‌కు ఇటీవల గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేటీఆర్ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. శంకర్‌నాయక్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



వీర్నపల్లిలో హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

బీఆర్‌ఎస్ ధర్నాతో సంబంధం లేదు

- సిరిసిల్ల వస్త్ర వ్యాపారులు



మాట్లాడుతున్న వస్త్రవ్యాపారులు

సిరిసిల్లటౌన్: వస్త్రపరిశ్రమ, నేతన్నల సమస్యలు పరిష్కరించాలంటూ..బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ ప్రకటించిన ధర్నాలో తాము పాల్గొనడం లేదని సిరిసిల్ల వస్త్రవ్యాపారులు స్పష్టం చేశారు. స్థానిక చేనేత, వస్త్రవ్యాపార సంఘం భవనంలో శనివారం మాట్లాడారు. వస్త్రపరిశ్రమ ఇబ్బందుల్లో ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. బకాయిలు, కొత్త ఆర్డర్లపై త్వరలోనే స్పష్టత వచ్చేలా ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాలకు వస్త్రపరిశ్రమను లాగొద్దని కోరారు. చేనేత వస్త్రవ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మండల సత్యం, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, సైజింగ్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌడ సురేశ్, డైయింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలుక రాజేశం, కాటన్ వస్త్రోత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టెకోల లక్ష్మీనారాయణ, మ్యాక్స్ సంఘాల అధ్యక్షుడు వెల్దండి శంకర్, పరిశ్రమ ముఖ్యులు ఏనుగుల ఎల్లయ్య, గౌడ రాజు, గోవిందు రవి, బూట్ల నవీన్, దుబాల మొండయ్య, వెంకటనర్సయ్య, కోడం శ్రీనివాస్, కొక్కుల వెంకటేశం, వేముల దామోదర్ పాల్గొన్నారు.

రూ.3,400 కోట్లు ఎవరికిచ్చారు

– కాంగ్రెస్ చేనేత సెల్ అధ్యక్షుడు ఎల్లప్ప

గత ఏడేళ్లలో సిరిసిల్ల వస్త్రపరిశ్రమకు రూ.3,400 కోట్లు ఇచ్చామని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ప్రకటించడం శోచనీయమని కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప పేర్కొన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్న ఒక స్పిన్నింగ్‌మిల్లును గత పాలకులు అమ్మేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటన్ వస్త్రోత్పత్తిని పూర్తిగా కుంటుపడేలా చేసింది బీఆర్‌ఎస్ నేతలు కాదా.. అని ప్రశ్నించారు. పరిశ్రమవర్గాల సమస్యలు ఎన్నోసార్లు చెప్పుకుందామని కేటీఆర్ వద్దకు పోతే కనీసం కలువనివ్వకుండా ఆ పార్టీ నేతలు ప్రవర్తించిన తీరు అందరికి తెలుసునని పేర్కొన్నారు. ఇప్పుడు వస్త్ర పరిశ్రమపై మొసలి కన్నీరు కార్చితే నమ్మేటోళ్లు ఎవరు లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, నేత కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు.



కల్యాణం.. కమనీయం



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని శివనగర్ శివాలయంలో శనివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణం కనులపండువగా సాగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షుడు సిరిపురం కృష్ణ, ఉపాధ్యక్షుడు గౌడ సురేశ్ పాల్గొన్నారు. మున్సిపల్ సమీపంలోని విశ్వనాథ స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈవో మారుతీరావు, ఏఈవోలు కోడం ప్రభాకర్, పీసరి రవీందర్, ప్రముఖులు రంగ కిషన్ పాల్గొన్నారు.

ముదిరిన మున్సిపల్ రాజకీయం

- వేములవాడ మున్సిపల్‌లో లేఖల యుద్ధం
- ఐదుగురిని సస్పెండ్ చేస్తూ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడి ప్రకటన
- బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తూ నలుగురు కౌన్సిలర్లు కేటీఆర్‌కు లేఖ
- వైస్‌చైర్మన్ ఎన్నికతో రాజకీయ వివాదం



వేములవాడ మున్సిపల్ ఆఫీస్

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నిక రాజకీయ దుమారం లేపుతుంది. మధు రాజేందర్ వైస్‌చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని పూరించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వైస్‌చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసింది. బీఆర్‌ఎస్ నుంచి మారం కుమార్ వైస్‌చైర్మన్ పదవి దక్కించుకునేందుకు తమ పార్టీ సభ్యులు, మద్దతుదారులతో క్యాంప్ నిర్వహించారు. అదే సమయంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతుండడంతో ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఉన్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తాను హాజరుకాలేనని పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థనతో ఏకీభవిస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం వైస్‌చైర్మన్ ఎన్నికను వాయిదా వేసింది. గోవా క్యాంప్‌లో ఉన్న వారంతా తిరిగి వేములవాడకు చేరుకున్నారు. ఈలోగా నెలకొన్న పరిణామాలతో పార్టీ మార్పులు, తమలోనే మనస్పర్థలు రావడంతో సభ్యులు విడిపోయారు. అందివచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోకుండా కాంగ్రెస్ పార్టీ కొంతమందిని తమ పార్టీలో చేర్చుకుంది. ఈనెల 7న వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించాలంటూ కలెక్టర్ అనురాగ్ జయంతి రెండోసారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఒక్క కౌన్సిలర్ సభ్యుడు ఉన్న కాంగ్రెస్ పార్టీకి 18 మంది మద్దతు లభించింది. ఈనెల 7న జరిగిన ఎన్నికలో బీఆర్‌ఎస్ నుంచి పోటీచేసిన మారం కుమార్‌కు 11, కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన బింగి మహేశ్‌కు 18 మంది మద్దతు లభించడంతో వైస్‌చైర్మన్‌గా ఎన్నికైనట్లు అడిషనల్ కలెక్టర్ గౌతమి ప్రకటించారు.

సస్పెండ్ చేశాం... రాజీనామా చేశాం

వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నిర్ణయించిన అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటువేసిన రెండు మిద్దెల జయ, యాచమనేని శ్రీనివాస్‌రావు, జడల లక్ష్మి, ముప్పిడి సునంద, మధు రాజేందర్‌లను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈక్రమంలోనే తాము ఈనెల 8వ తేదీనే బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు లేఖ రాశామంటూ రెండు మిద్దెల జయ, యాచమనేని శ్రీనివాస్‌రావు, జడల లక్ష్మి, మధు రాజేందర్‌లు శనివారం లేఖను విడుదల చేశారు. ఇక ముప్పిడి సునంద తాను బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలవలేదని స్పష్టం చేశారు.

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోపాటు వేములవాడ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపొంది ప్రభుత్వవిప్‌గా నియమితులయ్యారు. దీంతో వేములవాడ రాజకీయాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఒకే ఒక్క సీటుకు పరిమితమైన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత తన బలాన్ని పెంచుకుంటోంది. ఇప్పటికే బీజేపీ మద్దతుతో వైస్‌చైర్మన్ పదవిని సొంతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ అదే ఉత్సాహంలో చైర్‌పర్సన్ సీటును దక్కించుకోవాలని వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. మహాశివరాత్రి జాతర మహోత్సవాలు ముగియడంతో ఇక మరికొంత మందిని అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మొత్తానికి మున్సిపల్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి రానున్న ఎన్నికల్లో తమ ప్రాబల్యం పెంచుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

బీఆర్ఎస్ కౌన్సిలర్ల సస్పెన్షన్

- ఐదుగురిని సస్పెండ్ చేస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి ప్రకటన

వేములవాడ: వేములవాడ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటువేసిన ఐదుగురు కౌన్సిలర్లను సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేసిన కౌన్సిలర్లు రెండు మిద్దెల జయ, యాచమనేని శ్రీనివాస్‌రావు, జడల లక్ష్మి, ముప్పిడి సునంద, మధు రాజేందర్‌లను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే తాము ఈనెల 8వ తేదీనే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రాసిన లేఖను శనివారం విడదల చేశారు.

ఆల్ ఇండియా యూనివర్సిటీ క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: మహారాష్ట్రలోని స్వామి రామానంద్ తీర్థ మరాట్వాడా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ క్రాస్ కంట్రీ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన వర్సిటీస్థాయి పోటీల్లో రాణించిన చుక్కల ఐశ్వర్య, సభ మనుష, అఖిల, కిరణ్, జాన్, శ్యాంకుమార్ ఎంపికయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సంకసాల మల్లేశం, స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ మునవర్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, రవికుమార్, దుగ్యాని ఆంజనేయులు అభినందించారు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

- తెగిన కుడిచేయి వేలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని జీడీకే–11గనిలో శనివారం జరిగిన ప్రమాదంలో చంద్రమౌళి అనే కార్మికుడికి గాయాలయ్యాయి. గనిలోని పనిస్థలంలో పైపు మీదపడగా కుడిచేయి వేలు తెగిపోయింది. చంద్రమౌళిని వెంటనే గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు తెగిపోయిన వేలుతో సహా కార్మికుడిని హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. అయితే, వేలు అతికించి చికిత్స అందిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రోలర్ బెల్ట్‌వద్ద విధులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లుగా చెబుతున్నారు.

తహసీల్లో అన్నీ వివాదాలే..

- కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు పైసలిస్తేనే పనులు
- అమెరికాలో ఉన్న వ్యక్తికి ఎలా రిజిస్ట్రేషన్ చేశారని ఆరా
- కార్యాలయ సిబ్బందిపై కలెక్టర్ సీరియస్
- త్వరలో కిందిస్థాయి అధికారిపై వేటు?

వీణవంక: వీణవంక తహసీల్ కార్యాలయం వివాదాలకు నిలయంగా మారింది. కిందిస్థాయి అధికారి నుంచి పైస్థాయి అధికారి వరకు పైసలిస్తేనే పనులు జరుగుతాయనే ఆరోపణలున్నాయి. ఇటీవల తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ధరణి ఆపరేటర్లను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడంతో మరోసారి తహసీల్ కార్యాలయం చర్చనీయాంశంగా మారింది. వీణవంకకు చెందిన ఓ మహిళ అమెరికాలో ఉండగా.. ఆమెకు చెందిన 22 గుంటల భూమిని ఫోర్జరీ చేసి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారని ధరణి మాజీ ఆపరేటర్, భూమి కొనుగోలు చేసిన వ్యక్తితోపాటు మరో ఇద్దరిపై ఈనెల 6న తహసీల్దార్ తిరుమల్‌రావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంలో తిరుమల్‌రావు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్‌ సస్పెండ్ చేయడం కలకలం రేపింది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి ఫ్యామిలీ సర్టిఫికెట్ విషయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి డిజిటల్ కీ చోరీ చేసి సర్టిఫికెట్ ఇచ్చాడని తిరుమల్‌రావు గత నెలలో ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సీరియస్‌గా తీసుకొని డీటీ శ్రీనివాస్‌రెడ్డిపై వేటు వేశారు. ధరణి ఆపరేటర్ అరుణ్‌ను విధుల నుంచి తొలిగించారు. అప్పటినుంచే ఇరువురి అధికారుల మధ్య వివాదాలు రచ్చకెక్కాయి.



తహసీల్ కార్యాలయం

మరో అధికారిపై వేటుకు రంగం సిద్ధం

వరుస వివాదాలు తలెత్తడంతో మండల తహసీల్ కార్యాలయ సిబ్బందిపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. కార్యాలయంలో పని చేసే ఓ కిందిస్థాయి అధికారి వివాదాలకు తెర లేపుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. సదరు అధికారే అక్రమాలకు ఉసిగొలపడంతో తహసీల్దార్, డీటీ, ధరణి ఆపరేటర్ మధ్య విభేదాలు పెరిగాయని, వారు సస్పెండ్ అయ్యేవరకు వెళ్లిందని ఆరోపణలున్నాయి. సదరు అధికారిపై రెండు, మూడు రోజుల్లో వేటు వేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలిసింది.

దోస్తులు..

సస్పెండయిన తహసీల్దార్ తిరుమల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఒకే బ్యాచ్‌కు చెందినవారు కావడంతో.. ఇద్దరు చట్టాపట్టాలేసుకొని తిరిగేవారు. కేసుల నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డికి ప్రమోషన్ రాలేదు. తిరుమల్‌రావుకు మాత్రం ప్రమోషన్ రావడంతో.. జగిత్యాల నుంచి వీణవంకకు వచ్చారు. ఈ ఇద్దరి అధికారుల మధ్య ఓ కిందిస్థాయి అధికారి రెచ్చగొట్టడంతో కేసులు పెట్టుకునే స్థాయికి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది.

మిస్టరీగా ఓటీపీ

అమెరికాలో ఉంటున్న మహిళ పేరు మీద ఉన్న భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసేందుకు ఓటీపీ(వన్‌టైం పాస్‌వర్డ్) కీలకంగా మారనున్న నేపథ్యంలో ఇప్పుడు ఓటీపీ హాట్‌టాపిక్‌గా మారింది. ధరణి ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తే ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే పెద్ద తతంగమే జరిగినట్లు జిల్లా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఆమె గతంలో వాడిన ఫోన్ నంబర్‌ను గుర్తించి ఎవరి వద్ద ఉందో తెలుసుకొని ఓటీపీ చెప్పించారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు జిల్లా అధికారులు ఓటీపీ విషయంపై కూపీ లాగుతున్నట్లు తెలిసింది. ఈ తతంగమంతా మండల కిందిస్థాయి అధికారి నుంచి పైస్థాయి అధికారి వరకు తెలిసే జరిగినట్లుగా అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో కిందిస్థాయి అధికారిపై వేటు వేయనున్నట్లు తెలిసింది.

రైతుల అభివృద్ధికి తోడ్పడాలి

- ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, కలెక్టర్ పరికిపండ్ల నరహరి

జమ్మికుంట: వ్యవసాయ రంగంలో టెక్నాలజీని అందించి రైతుల అభివృద్ధికి తోడ్పడాలని ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ కేడర్‌కు చెందిన ఐఏఎస్ పరికిపండ్ల నరహరి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో రైతు సేవక్ అగ్రిమాల్, ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రోన్, వ్యవసాయ రంగం అనుసంధానించడంపై, యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ రంగంలో వచ్చే నూతన ఆవిష్కరణలను గ్రామీణ యువత ఉపయోగించుకొని ఉపాధి వైపు అడుగులు వేయాలని, రైతులు అధిక ఉత్పత్తులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ సపోర్టర్, అత్యా ఎండీ శ్రీగణేశ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారి శంకీ, బీఐసీసీఐ ప్రతినిధి కృష్ణమూర్తి, ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గుణసాగర్, అగ్రిమాల డైరెక్టర్ బండి కోటేశ్వర్, యువకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ పరికిపండ్ల నరహరి

మరణంలోనూ వీడని బంధం

- చెల్లెలి మరణ వార్త విని అక్క మృతి

రుద్రంగి(వేములవాడ): ఆ ఇద్దరి అక్కాచెల్లెళ్ల అనుబంధం మరణంలోనూ వీడలేదు. చెల్లెలి మరణవార్త విని గుండె ఆగి అక్క మృతిచెందిన సంఘటన శనివారం సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో విషాదం నింపింది. రుద్రంగికి చెందిన గడ్డం లక్ష్మీనర్సు, జగిత్యాల జిల్లా భీమారం మండలం పసునూర్‌కు చెందిన చిట్యాల రామక్క అక్కాచెల్లెళ్లు. పసునూర్‌కు చెందిన చిట్యాల రామక్క హఠాత్తుగా శనివారం మరణించింది. ఆ వార్తను కుటుంబ సభ్యులు వీడియో కాల్ ద్వారా గడ్డం లక్ష్మీనర్సుకు తెలియజేశారు. ఆ వార్త విన్న గడ్డం లక్ష్మీనర్సు వెంటనే కుప్పకూలింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు.


లక్ష్మీనర్సు(ఫైల్)

శోకసంద్రంలో కుటుంబం

అప్పటివరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉన్న ఇంటి పెద్ద దిక్కు హఠాత్తుగా మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పోలీసుల అదుపులో నిందితుడు

రాయికల్: మండలంలోని తాట్లవాయికి చెందిన నాగెల్లి సురేశ్‌ను హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారణ చేపట్టడంతోపాటు హత్యకు వినియోగించిన మారణాయుధాలను శనివారం ఎస్సై అజయ్ గ్రామానికి చేరుకుని స్వాధీనం చేసుకున్నారు. హత్యలో నిందితుడికి ఎవరైనా సహకరించారా..? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

రామాలయ హుండీ చోరీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారు రామాలయంలోని హుండీని దొంగలు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి దొంగలు రామాలయంలోకి చొరబడి హుండీని ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. హుండీలో మూడునెలలుగా భక్తులు వేసిన డబ్బులు ఉన్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్ పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో తిరిగి ఆనవాళ్లపై ఆరా తీశారు.

విద్యుత్ స్టార్టర్ల అపహరణ


దొంగలు ఎత్తుకెళ్లిన స్టార్టర్లు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సింగారంలో శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి అనే రైతులకు చెందిన పొలాల వద్ద ఉన్న విద్యుత్ మోటార్ల ఫీజులు, స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఒకే రోజు రాత్రి నాలుగు బావుల వద్ద ఉన్న మోటార్ల స్టార్టర్లను దొంగలించడంపై బాధిత రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాష్‌పాండ్ గుట్టల్లో మంటలు


గుట్టపై చెలరేగుతున్న మంటలు

రామగుండం: కుందనపల్లిలోని ఎన్టీపీసీ బూడిద చెరువు వైపు గుట్టల్లో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. దీంతో సమీప నివాసాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు తక్షణమే స్పందించి అగ్నిమాపక శాఖ సిబ్బందితో మంటలను అదుపులోకి తేవాలని పట్టణవాసులు కోరుతున్నారు. లేదంటే మంటలు వ్యాపించి ఇళ్లకు ప్రమాదం పొంచిఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్-2024కు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ న్యూఢిల్లీలో ఈనెల 11 నుంచి 16 వరకు నిర్వహించే ప్రపంచంలో అతి పెద్ద సాహిత్యోత్సవం ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్–2024లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు చెందిన రచయిత అన్నవరం దేవేందర్‌కు శనివారం ఆహ్వానం అందింది. ఈ మేరకు సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కె.శ్రీనివాసరావు లేఖ రాస్తూ ఈ ఉత్సవంలో పాల్గొని 21వ శతాబ్దపు భారతీయ కవిత్వంపై కవిత చదవాల్సిందిగా కోరారు. సాహిత్య అకాడమీ 70 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆరు రోజులపాటు సాగే సాహిత్య ఉత్సవంలో 175 భాషల నుంచి జాతీయస్థాయిలో అన్ని ప్రాంతాల నుంచి రచయితలు, కవులు, పరిశోధకులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. కథ–కవిత్వం–నాటకరంగం అంశాలపై అంతర్జాతీయ సదస్సులు, సాహిత్య అకాడమీ పురస్కారాలుంటాయని తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.


అన్నవరం దేవేందర్

మద్యం మత్తులో తన్నుకున్నారు

- ఠాణాకు చేరిన పంచాయితీ • విచారణ చేపట్టిన పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం రాత్రి పలువురు యువకులు మద్యం మత్తులో తన్నుకున్నారు. అంతటితో ఆగకుండా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో ఈ తతంగంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికంగా ఓ రాజకీయ నాయకుడి అండదండలతో ప్రతీ ఆదివారం రాత్రి వేళ మండల కేంద్రం శివారులోని ధనంగుండు వద్ద కొందరు యువకులు మద్యం విందు చేసుకుంటున్నట్లు తెలిసింది. తాజాగా ఈ శనివారం కూడా కొందరు యువకులు ఆ ప్రాంతంలోని దావత్ చేసుకున్నట్లు సమాచారం. ఫుల్లుగా తాగాక మద్యం మత్తులో మాట.. మాట పెరిగి తన్నుకున్నారు. అంతటితో ఆగకుండా ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి పంచాయితీకి దిగినట్లు తెలిసింది. దీంతో ఇరువర్గాల ఫిర్యాదులతో పోలీసులు విచారణ చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. దాడి జరిగిన సంఘటన స్థలంలో ఓ యువకుడి సెల్‌ఫోన్ ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తాగిన మైకంలో కొందరు పరస్పరం దాడి చేసుకున్నారని తమకు ఫిర్యాదు వచ్చిందని, విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

కొండగట్టు ఘాట్‌రోడ్‌పై ఆటో బోల్తా

- 11 మందికి గాయాలు


జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయ ఘాట్‌రోడ్‌పై శనివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ఆటో ఘాట్ రోడ్‌పై నుంచి కిందికి వస్తున్న క్రమంలో బోల్తాపడింది. ఈ ఘటనలో అందులో ఉన్న 11 మంది గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం మ్యాదరిపేటకు చెందిన భక్తులు కొండగట్టు అంజన్న దర్శనానికి శుక్రవారం రాత్రి వచ్చారు. దర్శనం పూర్తయ్యాక శనివారం తిరిగి వెళ్లే క్రమంలో ఆటోలో ఘాట్‌రోడ్ మీదుగా బయల్దేరారు. ఆటోస్పీడ్‌గా వెళ్లడంతోపాటు అదే సమయంలో బ్రేక్‌లు ఫెయిలయ్యాయి. ఎదురుగా వస్తున్న కారు, ఇతర భక్తులను తప్పించే క్రమంలో సమీపంలోని రేయిలింగ్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న భక్తుల్లో కొందరికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారి పరిస్థితి బాగానే ఉందని వైద్యుల ద్వారా తెల్సింది.

నకిలీ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్



మాట్లాడుతున్న జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

- నలుగురు నిందితుల అరెస్ట్
- 395 నకిలీ సర్టిఫికెట్లు స్వాధీనం
- జగిత్యాల ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాలక్రైం: నకిలీ సర్టిఫికెట్లు తయారుచేసి.. విక్రయించే ముఠాను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. శనివారం జిల్లా కొత్త పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో నిందితులను అరెస్ట్ చూపారు. ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన కొడిదల మహేశ్ 9వ తరగతి వరకు చదివాడు. గల్ఫ్ వెళ్లేందుకు పాస్‌పోర్ట్‌కు ఈసీఎన్ఆర్ అవసరం ఉండటంతో పదో తరగతి సర్టిఫికెట్ అవసరం పడింది. అతను 9వ తరగతి వరకే చదివాడు. విషయాన్ని అతడి బంధువు, జైనకు చెందిన కొక్కెరకాని చంద్రయ్య అలియాస్ చందుకు తెలిపాడు. చంద్రయ్య తనకు బంధువైన బత్తినోజు రజిత నకిలీ సర్టిఫికెట్లు ఇప్పిస్తుందని తెలిపాడు. ఇద్దరూ కలిసి రజితకు మహేశ్ ఆధార్‌కార్డు, ఇతర వివరాలు ఇచ్చి రూ.28 వేలను ఫోన్‌పే ద్వారా చెల్లించారు. 27 రోజుల తర్వాత రజిత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ రూల్ నంబరు 16009712587З గల నకిలీ ఓపెన్ ఎస్సెస్సీ సర్టిఫికెట్ ఇచ్చింది. దాంతో మహేశ్ పాస్‌పోర్టులో ఈసీఎన్ఆర్ కోసం అప్లై చేసుకున్నాడు. ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ నర్సింగరావు పాస్‌పోర్టు ఎంక్వైరీ సమయంలో నకిలీ సర్టిఫికెట్‌గా గుర్తించి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించి విచారణ చేపట్టారు. ఇందులో అనేక విషయాలు వెలుగుచూశాయి. బత్తినోజు రజిత, ఆమె భర్త శ్రవణ్‌కుమార్ ప్రైవేటు ఉద్యోగులు. డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో 2020లో జస్టడయల్‌లో పశ్చిమబెంగాల్ రాష్ట్రం బరహాంపూర్‌కు చెందిన రబిరాయ్‌తో పరిచయం చేసుకుని నకిలీ సర్టిఫికెట్ల దందాకు తెరలేపారు. టెన్త్, ఇంటర్‌కు రూ.30వేలు, డిగ్రీకి రూ.40వేలు, ఇంజినీరింగ్‌కు రూ.50 నుంచి రూ.60వేలకు నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించారు. నకిలీ సర్టిఫికెట్లు అవసరం ఉన్న వారి వివరాలను వాట్సప్ ద్వారా తెప్పించుకుని రబిరాయ్‌కి పంపేవారు. అతడు సర్టిఫికెట్లు తయారుచేసి కొరియర్ చేసేవాడు. డబ్బులు రబిరాయ్ తల్లి లక్ష్మీరాయ్ అకౌంట్‌కు పంపించేవారు. ఇలా మూడేళ్లలో సుమారు 100మందికి పైగా నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించారని, ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.లక్ష నుంచి రూ.1.30లక్షల వరకు తీసుకున్నారని విచారణలో తేలింది. ఈ మేరకు నిందితులను శుక్రవారం జైన, కరీంనగర్ జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో వారి ఇంటి వద్ద ఉండగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్ పట్టుకున్నారు. వారి నుంచి 395 నకిలీ సర్టిఫికెట్లు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.25 వేలు, ల్యాప్‌టాప్, సీపీయూ, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో బత్తినోజు రజిత, బత్తినోజు శ్రవణ్‌కుమార్, కొడిదల మహేశ్, కొక్కెరకాని చంద్రయ్య ఉన్నారు. మిగిలిన ఇద్దరు నిందితులు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రబిరాయ్, లక్ష్మీరాయ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నకిలీ సర్టిఫికెట్ల కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉదయ్‌కుమార్, సీసీఎస్ నరేశ్‌కుమార్, ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.నర్సింగరావు, కానిస్టేబుళ్లు నవీన్‌కుమార్, రమేశ్, వేణును ఎస్పీ అభినందించారు. వారికి నగదు రివార్డులు పంపిణీ చేశారు.

నకిలీ ఉద్యోగుల్లో గుబులు

ధర్మపురి: మూడేళ్ల నుంచి నకిలీ సర్టిఫికెట్లతో వందలాది మంది ప్రైవేట్ కంపెనీల్లో చేరారు. ప్రస్తుతం వారంతా ఉద్యోగాలు చేస్తున్నారు. తాజాగా నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి రావడంతో నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాల్లో చేరిన వారిలో గుబులు రేపుతోంది. ఏ క్షణం ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. నకిలీ సర్టిఫికెట్లతో హైదరాబాద్, బెంగళూర్, విదేశాల్లోని ప్రైవేట్ కంపెనీల్లో పనిచేస్తున్న నకిలీల కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నకిలీ సర్టిఫికెట్ల అంశం తెరపైకి రావడంతో జైనా గ్రామం ఉలిక్కిపడింది.

కన్నుల పండువగా అల్ఫోర్స్ టైనీటాట్స్ కౌస్తుభమ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి


చిన్నారుల నృత్యం

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ వార్షిక వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. అల్ఫోర్స్ కౌస్తుభమ్ పేరిట నిర్వహించిన ఈ వేడుకలను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి, ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు డాక్టర్ ఎల్.రాజభాస్కర్‌రెడ్డితో కలిసి శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.రాజభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాల్య దశ నుంచే విద్యార్థులను సన్మార్గంలో తీసుకెళ్లాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించినప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకొని సమాజంలో మంచి గుర్తింపును తెచ్చుకుంటారని అన్నారు. అల్ఫోర్స్ చైర్మన్ డా.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యాప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు చక్కని విద్యనందించడమే కాకుండా పోటీ పరీక్షల్లో రాణించేలా చక్కని శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు చక్కగా రాణిస్తూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మల్యాల: రాజారం గ్రామ శివారులో శనివారం అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల రహీం తెలిపారు. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు బొలేరో వాహనంలో అక్రమంగా 43 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళ దారుణ హత్య

- గొంతు కోసి చంపిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఆధారాలు దొరకకుండా కారం పొడి చల్లిన వైనం
- విచారణ చేపట్టిన పోలీసులు

వీర్నపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రించిన మహిళ.. తెల్లారేసరికి హతమైంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. వన్‌పల్లికి చెందిన శివరాత్రి మల్లవ్వ(42)కు ధర్మారం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. దంపతుల మధ్య విభేదాలతో వేర్వేరుగా ఉంటున్నారు. మల్లవ్వకు ఇద్దరు కొడుకులు కాగా.. పెద్ద కొడుకు రాజు గతంలోనే ట్రాక్టర్ బోల్తా పడి మృతిచెందాడు. రెండో కుమారుడు శేఖర్ ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్‌గా మరో గ్రామంలో పని చేస్తున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న మల్లవ్వ రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి నిద్రపోయింది. శనివారం ఉదయం రక్తపు మడుగులో విగతజీవిగా గ్రామస్తులకు కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె గొంతు కోసి హత్య చేశారు. ఆధారాలు గుర్తుపట్టకుండా ఆమె ఉంటున్న గుడిసెలో కారం పొడి చల్లారు. హత్య విషయం తెలుసుకున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, వీర్నపల్లి ఎస్సై రమేశ్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.


మల్లవ్వ(ఫైల్)

ఇద్దరిపై అనుమానం

శుక్రవారం రాత్రి పొద్దుపోయాక ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వన్‌పల్లికి వచ్చి మల్లవ్వ అడ్రస్ కావాలంటూ గ్రామస్తులను అడిగినట్లు ప్రచారంలో ఉంది. సదరు వ్యక్తులతో మల్లవ్వ ఫోన్‌లో మాట్లాడి తమకు కావాల్సిన వ్యక్తులేనని, అడ్రస్ చెప్పండని తెలిపినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.